సక్షంతో సురక్షితం


చిన్నారుల ఆనందం, ఆరోగ్యకరమైన బాల్యానికి చేయూత ఇచ్చేందుకు, వారి పోషణ స్థాయిని పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం సక్షం (సిమ్యులేటింగ్ అడ్వాన్స్‌డ్ నాలెడ్జ్ ఫర్ సస్టైనబుల్ హెల్త్ మేనేజ్) పేరుతో కొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఇప్పటి వరకు అందుబాటులో ఉన్న వసతులు, సదుపాయాలకు తోడు అదనపు హంగులు జోడించనున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లోనే కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు పండించేందుకు కిచెన్ గార్డెన్లను ఏర్పాటు చేయడంతో పాటు ఇంకుడు గుంతలను తవ్వడం, పిల్లలు ఆడుకునేందుకు అవసరమైన ఆట వస్తువులు, బొమ్మలను సమకూర్చనున్నారు. ఇందుకు అవసరమైన నిధులను కేంద్ర ప్రభుత్వం కేటాయించింది.



ఆగిరిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రం


అంగన్‌వాడీ వర్కర్లకు జీవామృతం తయారీపై శిక్షణ ఇస్తున్న జెడ్‌పీఎన్‌ఎఫ్ సిబ్బంది

- చిన్నారుల బాల్యానికి చేయూత
- కేంద్ర ప్రభుత్వ సహకారంతో అంగన్‌వాడీల్లో 'సక్షం' అమలు
- కూరగాయలు, ఆకుకూరలు, పండ్ల సాగుకు కిచెన్ గార్డెన్ల ఏర్పాటు
- నియోజకవర్గంలో 163 కేంద్రాలు ఎంపిక



నూజివీడు: సక్షం పథకం అమలుకు ఐసీడీఎస్ నూజివీడు ప్రాజెక్టు పరిధిలో మొత్తం 319 అంగన్‌వాడీ కేంద్రాలుండగా వాటిలో సొంత భవనాలు ఉన్నవి 150, అద్దె భవనాల్లో ఉన్నవి 109, అద్దె లేని కేంద్రాలు 60 చొప్పున ఉన్నాయి. వీటిలో 163 కేంద్రాలను ఎంపిక చేశారు. సొంత భవనాలు ఉండి ఆవరణలో స్థలం ఉన్న వాటిని, సమీపంలో ఖాళీ స్థలం అందుబాటులో ఉన్న కేంద్రాలకు ప్రాధాన్యత ఇచ్చారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు పిల్లల మానసిక వికాసాన్ని పెంపొందించేందుకు, వర్షం నీటిని ఒడిసి పట్టేందుకు చర్యలు చేపడుతూ సక్షం పథకం అందుబాటులోకి తేవాలని సంకల్పించింది. ఈ నేపథ్యంలోనే నూజివీడు నియోజకవర్గ పరిధిలో 163 అంగన్‌వాడీ కేం ద్రాలను ఎంపిక చేసి ఈ నెల నుంచే ఈ పథకాన్ని అమల్లోకి తెచ్చింది. కిచెన్ గార్డెన్లను పెంచేందుకు ఇప్పటికే ఉద్యాన శాఖాధికారులతో అంగన్‌వాడీ వర్కర్లకు శిక్షణ తరగతులు సైతం నిర్వహించారు. ఈ కిచెన్ గార్డెన్‌ను ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో నిర్వహించనుండటంతో పూర్తిగా సురక్షితం.

ప్రతి కేంద్రానికి రూ.45,800 కేటాయింపు

ఈ పథకంలో భాగంగా కిచెన్ గార్డెన్, ఇంకుడు గుంతల ఏర్పాటు, నిర్వహణ, చిన్నారుల ఆటలకు, రంగులు వేసేందుకు ప్రతి అంగన్‌వాడీ కేంద్రానికి రూ.45,800 ప్రభుత్వం కేటాయించింది. దీనిలో కిచెన్ గార్డెన్ పెంచేందుకు రూ.10 వేలు, ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసేందుకు రూ.16 వేలు, పిల్లల బొమ్మలు, ఆట వస్తువులతో పాటు కేంద్రాలకు రంగులు వేసేందుకు రూ.19,800 కేటాయించింది. నియోజకవర్గంలోని 163 కేంద్రాలకు కలిపి రూ.74.65 లక్షలను విడుదల చేసింది.

పథకం ఎంతో ఉపయోగం



సక్షం పథకం వల్ల చిన్నారులకు, గర్భిణులు, బాలింతలకు ఎంతో మేలు కలుగుతుంది. ఎంపిక చేసిన 163 కేంద్రాల్లో ఈ పథకం నిధులతో అంగన్‌వాడీ కేంద్రాల్లో అవసరమైన వసతులు అందుబాటులోకి రానున్నాయి. కిచెన్ గార్డెన్‌లను ఏర్పాటు చేసి సద్వినియోగం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నాం.

– ఎస్వై నూరాని, సీడీపీఓ, నూజివీడు

ఉత్సాహంగా ముగ్గులు, చిత్రలేఖనం పోటీలు

మైలవరం: గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు జి. కొండూరు శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. సీనియర్లకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలు, జూనియర్లకు గ్రంథాలయాలు–వాటి ప్రాధాన్యతపై పోటీలు జరిగాయని గ్రంథాలయాధికారి వి. విజయకృష్ణ తెలిపారు.

- **మైలవరం** శాఖా గ్రంథాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. 65 మంది మహిళలు ఉత్సాహంగా ముగ్గులు వేశారు. విజేతలకు గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సభలో బహుమతులు అందజేస్తామని మదర్ థెరిస్సా చారిటబుల్ ట్రస్టు అధ్యక్షురాలు కోయ సుధ తెలిపారు. కార్యక్రమంలో మహిళలు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళా సాధికారతకు పునాది గ్రంథాలయాలు

ముసునూరు: మహిళలు, విద్యార్థుల్లో స్ఫూర్తి, సాధికారత సాధనకు గ్రంథాలయాలు పునాది వంటివని వక్తలు పేర్కొన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా ఆరో రోజు మంగళవారం గోపవరం బ్రాంచి గ్రంథాలయాధికారి సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై సచివాలయ మహిళా కానిస్టేబుల్ మేకా లక్ష్మీప్రసన్న చిన్నారులకు అవగాహన కల్పించారు. మహిళా సాధికారతపై పలువురు బాలికలు మాట్లాడారు. అనంతరం బాలికలకు రంగవల్లికల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ కమిటీ సభ్యులు, పాఠకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

- **చాట్రాయి:** మండలంలోని చనుబండ గ్రంథాలయంలో గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా మంగళవారం మహిళా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సచివాలయ మహిళా పోలీసు కిరణ్మయి, గ్రంథాలయ అధికారి శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.


జి.కొండూరులో తాము వేసిన చిత్రాలను చూపుతున్న విద్యార్థులు


తిరువూరు శాఖా గ్రంథాలయంలో పోటీల్లో పాల్గొన్న బాలికలు

- **తిరువూరు:** తిరువూరు గ్రేడ్ 1 శాఖా గ్రంథాలయంలో మంగళవారం మహిళా దినోత్సవం నిర్వహించారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి గ్రంథాలయాధికారి పద్మావతి, పాఠకులు, విద్యార్థులు నివాళులర్పించారు. బాలికలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. బుధవారంతో వారోత్సవాలు ముగిస్తున్నట్లు గ్రంథాలయాధికారి తెలిపారు.
- **నూజివీడు:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో మంగళవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చందక రాజా రామ్మోహన్‌రావు, రిటైర్డ్ ఎంఈఓ వంగల గోవిందరావు, విశ్రాంత వాణిజ్య శాఖ ఉప కమిషనర్ బత్తుల కోటేశ్వరి, ప్రముఖ కవి శిఖా ఆకాష్, గ్రంథాలయాధికారి బీసీహెచ్ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గొల్లపల్లిలో..

మండలంలోని గొల్లపల్లి గ్రంథాలయంలో మంగళవారం గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి డొక్కు శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు వల్లభనేని పద్మ, జల్దు లక్ష్మి, దుర్గామల్లేశ్వరి, మోహన్‌రావు, రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

- **విస్సన్నపేట:** గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మహిళా దినోత్సవం నిర్వహించారు. దివంగత ఇందిరా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. స్థానిక ఎంపీపీ పాఠశాల హెచ్‌ఎం వరలక్ష్మి, లైబ్రేరియన్ పి. భాను పాల్గొన్నారు.
- **ఆగిరిపల్లి:** స్థానిక ప్రభుత్వ కళాశాల విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా సాధికారతపై చర్చ జరిగింది. గ్రంథాలయాధికారి నాగేశ్వరరావు, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని విజయదుర్గ, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాల విద్య బలోపేతానికే శిక్షణ తరగతులు

రాష్ట్ర విద్యా శాఖ జోన్–2 ఆర్‌జేడీ నాగమణి

ఆగిరిపల్లి: పాఠశాల విద్యను బలోపేతం చేయడమే స్కూల్ లీడర్ షిప్ లక్ష్యమని రాష్ట్ర విద్యా శాఖ జోన్–2 రీజినల్ జాయింట్ డైరెక్టర్ జి.నాగమణి అన్నారు. తోటపల్లిలోని హీల్ ప్యారడైజ్ ఆవరణలో సోమవారం నుంచి ఆరు రోజుల పాటు ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యా శాఖాధికారులకు రెసిడెన్షియల్ పద్ధతిలో నిర్వహిస్తున్న శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. సుమారు 250 మంది ప్రధానోపాధ్యాయులు శిక్షణ తరగతుల్లో పాల్గొంటున్నారని చెప్పారు. అడిషనల్ ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ శ్యాం సుందర్, రాష్ట్ర సమగ్ర శిక్ష సంచాలకులు శ్రీనివాసరావు, సీమాట్ డైరెక్టర్ మస్తానయ్య పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

ఇబ్రహీంపట్నం: విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక విజయవాడ వారి ఆధ్వర్యంలో విద్యుత్ అదాలత్, అవగాహన సదస్సు గురువారం నిర్వహిస్తామని విజయవాడ రూరల్ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.వసంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మైలవరం రాజా ఎస్‌వీఆర్‌జీ నరసింహారావు కల్యాణ మండపంలో జరుగనున్న సదస్సుకు కన్జ్యూమర్ గ్రీవెన్సెస్ రెడ్రెసెల్ ఫోరం (సీజీఆర్‌ఎఫ్) చైర్‌పర్సన్ ఎస్.విక్టర్ ఇమ్మానియేల్, ఈఈ వసంతరావు పాల్గొని సమస్యలు పరిష్కరిస్తారన్నారు. మైలవరం, నందిగామ, జగ్గయ్యపేట నియోజక వర్గాల పరిధిలోని మండలాలకు చెందిన విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను రాతపూర్వకంగా ఫిర్యాదు చేసి పరిష్కరించుకోవచ్చని చెప్పారు.

ఉచిత ఇసుక నిబంధనలు పాటించాలి

తిరువూరు ఆర్డీఓ మాధురి

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత ఇసుక విధానానికి మార్గదర్శకాలను తప్పక పాటించాలని తిరువూరు ఆర్డీఓ మాధురి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక అవసరాలకు వాగుల్లో ఇసుకను యంత్రాలతో తోడరాదని, ఇసుకను ఎద్దుల బండి లేదా ట్రాక్టర్ల ద్వారా మాత్రమే తెచ్చుకోవాలని, రవాణా వాహనాలపై తప్పక ఉచిత ఇసుక రవాణా వాహనం అనే బ్యానర్ ఏర్పాటు చేయాలని, రిజిస్ట్రేషన్, ఉచిత ఈ ట్రాన్సిట్ ఫారం లేదా పర్మిట్ లేకుండా ఉచిత ఇసుక రవాణా చేసే వాహనాలపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. కట్టడాల కోసం తరలించిన ఉచిత ఇసుకను సచివాలయ సిబ్బంది తనిఖీ చేస్తారని వెల్లడించారు. నిబంధనలు అతిక్రమించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పాల సేకరణ ధర పెంపు

తిరువూరు: కృష్ణా మిల్క్ యూనియన్‌లో సభ్యులైన పాల ఉత్పత్తిదారులకు డిసెంబరు 1 నుంచి పాల సేకరణ ధర లీటరుకు రూ.2 చొప్పున పెంచాలని పాలకవర్గం నిర్ణయించిందని తిరువూరు క్లస్టర్ మేనేజరు సాంబశివమూర్తి తెలిపారు. మంగళవారం లక్ష్మీపురం పాలశీతల కేంద్ర ఆవరణలో జిల్లా పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు, నెక్కళపు వాణిశ్రీల ఆధ్వర్యంలో జరిగిన పాల ఉత్పత్తిదారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పెరిగిన ధరల కనుగుణంగా పాల సేకరణ ధరను పెంచాలని జిల్లా యూనియన్ నిర్ణయించిందన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో ఆగస్టు నుంచి నవంబర్ వరకు రెండో విడత బోనస్ చెల్లిస్తామని చెప్పారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

మైలవరం: రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు గాయపడ్డారు. మైలవరం మండలం కొత్తగూడెం గ్రామానికి చెందిన కె. రామారావు, తుమ్మల సుబ్బారావులు మంగళవారం ఉదయం ఇంటి నుంచి ద్విచక్ర వాహనంపై తిరువూరు రోడ్డుకు బయలుదేరారు. తిరువూరు వైపు నుంచి వస్తున్న కారు వీరి వాహనాన్ని ఢీకొంది. ఈ ప్రమాదంలో కె. రామారావుకు స్వల్ప గాయాలు, సుబ్బారావుకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితులను ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం విజయవాడ ఆస్పత్రికి తరలించారు.

ఆయిల్ పామ్ సాగుపై ఆసక్తి చూపాలి

ఉద్యాన శాఖాధికారి హేమ

చాట్రాయి: ఆయిల్ పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపాలని ఉద్యాన శాఖాధికారి హేమ అన్నారు. చనుబండ, బూరుగుగూడెం గ్రామాల్లోని ఆయిల్ పామ్ సాగుపై రైతులకు మంగళవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ నీటి యాజమాన్య వసతులు కలిగిన రైతులకు ఆయిల్ పామ్ సాగు లాభదాయకంగా ఉంటుందన్నారు. ఈ సాగుకు సబ్సిడీపై యంత్ర పరికరాలు అందజేస్తామని చెప్పారు. గోద్రెజ్ కంపెనీ మేనేజర్ వీవీ శ్యామ్ సుందరరావు మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్కలకు దరఖాస్తు చేసుకుంటే ఉచితంగా ఇస్తామన్నారు. కార్యక్రమంలో గోద్రెజ్ కంపెనీ సిబ్బంది, రైతు సేవా కేంద్రం సిబ్బంది, జిల్లా తెలుగు రైతు కార్యదర్శి మోరంపూడి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

24న యూటీఎఫ్ జిల్లా మహాసభ

విస్సన్నపేట: యూటీఎఫ్ జిల్లా ప్రథమ మహాసభ ఈ నెల 24వ తేదీన విజయవాడలో జరుగుతుందని మండల ప్రధాన కార్యదర్శి మురళీకృష్ణ తెలిపారు. మహాసభ కరపత్రాలను యూటీఎఫ్ కార్యకర్తలు మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో వి. రవి, కైలా చైతన్య, కస్తూరి లలిత, అనూరాధ, రాంబాబు, సువర్ణరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పీఈటీల పాత్ర కీలకం

నూజివీడు: విద్యార్థుల క్రమ శిక్షణలో వ్యాయామ ఉపాధ్యాయుల పాత్ర కీలకమని ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్ హెచ్‌ఎం బి.హేమలత అన్నారు. నియోజకవర్గ వ్యాయామ ఉపాధ్యాయుల స్కూల్ కాంప్లెక్స్ సమావేశం స్థానిక ఎస్‌ఆర్‌ఆర్ హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యోగా, హెల్త్ ఎడ్యుకేషన్, ఆహార నాణ్యత తదితర అంశాలు, ఆటల బాధ్యత వ్యాయామ ఉపాధ్యాయులదేనన్నారు.

వ్యాసరచన పోటీలు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లి జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాలు–ఆరోగ్యంపై ప్రభావం అంశంపై వ్యాసరచన పోటీలు మంగళవారం నిర్వహించారు. నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ ప్రియాంక మాట్లాడుతూ మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. డ్రగ్స్ తీసుకోవడం వలన నాడీ వ్యవస్థపై ప్రభావం చూపి అనారోగ్యానికి గురవుతారని చెప్పారు. వ్యాసరచన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

ధర్నా కరపత్రాల ఆవిష్కరణ

ఇబ్రహీంపట్నం: కేంద్ర ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై విజయవాడలో ఈనెల 26న జరుగనున్న కార్మిక, కర్షక, రైతు శంఖారావం ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్‌సీహెచ్ శ్రీనివాస్ కోరారు. ఇబ్రహీంపట్నంలో ధర్నా కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. మండల కార్యదర్శి ఎం. మహేష్, అధ్యక్షుడు వాసుదేవ్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థినికి బ్లాక్ బెల్ట్



నూజివీడు: మండలంలోని రేగుంటకు చెందిన బూరుగు రెబకా గ్రేస్ కరాటేలో ఇన్‌స్ట్రక్టర్ల బ్లాక్ బెల్ట్ సాధించింది. నిడదవోలులో నిర్వహించిన రాష్ట్ర స్థాయి గుజారియో కరాటే అడ్వాన్స్ శిక్షణ శిబిరంలో బ్లాక్ బెల్ట్ సాధించగా, ఫెడరేషన్ చీఫ్ ఎల్.నాగేశ్వరరావు, ఏపీ చీఫ్ ఎంవీ రామ్మూర్తి రాజు చేతుల మీదుగా బ్లాక్ బెల్ట్‌ను అందుకుంది. రెబకాను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖా మంత్రి కందుల దుర్గేష్ అభినందించారు. పట్టణంలోని సెయింట్ థామస్ స్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న రెబకాను పాఠశాల హెచ్‌ఎం ఫాదర్ చిన్నపురెడ్డి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

బాలోత్సవ్‌లో విద్యార్థుల ప్రతిభ

నూజివీడు: అమరావతి, వీవీఐటీ బాలోత్సవ్‌లో పట్టణంలోని కుమార్ సీబీఎస్‌ఈ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపారని కుమార్ విద్యాసంస్థల చైర్మన్ పిన్నమనేని వెంకటకుమార్ తెలిపారు. 250 పాఠశాలల నుంచి సుమారు మూడు వేలకు పైగా విద్యార్థులు పాల్గొని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను 14 మంది విద్యార్థులు కైవసం చేసుకున్నారన్నారు. ప్రోత్సాహక బహుమతులను 13 మంది విద్యార్థులు సాధించారన్నారు. విద్యార్థులను చైర్మన్, వైస్ చైర్మన్, ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా జాతీయ పురుషుల దినోత్సవం



ముసునూరు: కుటుంబ బరువు బాధ్యతలకు కొండంత అండ పురుషులేనని మండలంలోని చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం అబ్బాస్ అన్నారు. జాతీయ పురుషుల దినోత్సవం మంగళవారం స్థానిక హైస్కూల్‌లో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కుటుంబంలో, సమాజంలో పురుషుల పాత్రను వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆధార్ శిబిరాలు సద్వినియోగం చేసుకోండి

ఇబ్రహీంపట్నం: ఆధార్ నమోదు ప్రత్యేక శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ సునీతశర్మ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. ఈనెల 19 నుంచి 20వ తేదీ వరకు త్రిలోచనాపురం, 21న కేతనకొండ, 22న కొటికలపూడి, 26న కాచవరం, 27న మూలపాడు, 28న గుంటుపల్లి అంగన్‌వాడీ సెంటర్, 29న గుంటుపల్లి ఎంపీపీ పాఠశాలలో ఆధార్ నమోదు శిబిరాలు జరుగుతాయని వివరించారు.

మద్యం సీసాలు స్వాధీనం

మైలవరం: రెడ్డిగూడెం మండలం రుద్రవరం గ్రామానికి చెందిన అజ్మీరా బాలాజీ అనధికారికంగా మద్యం అమ్ముతుండగా దాడి చేసి అతని నుంచి 10 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నామని ఎక్సైజ్ సీఐ జె. శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశామన్నారు.

26 నుంచి భాగవత సప్తాహం

తిరువూరు: భాగవత సప్తాహం కార్యక్రమం ఈ నెల 26 నుంచి స్థానిక కోదండ రామాలయంలో జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి పర్యవేక్షణలో ప్రతి రోజూ ఉదయం 9 నుంచి 12 గంటల వరకు భాగవత ప్రవచనం సాయంత్రం 5.30 గంటలకు విష్ణు సహస్రనామ పారాయణం, అనంతరం శ్రీమద్భాగవత ప్రవచనం జరుగుతాయని వివరించారు.

మొక్కజొన్న రైతుల సమస్యలు పరిష్కరించాలి


ఆర్డీఓ మోవిడి వాణికి అర్జీని అందజేస్తున్న వామపక్ష నాయకులు

నూజివీడు: విత్తన మొక్కజొన్న సాగు చేస్తున్న రైతుల సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని వామపక్ష పార్టీల నాయకులు ఆర్డీఓ మోవిడి వాణికి విజ్ఞప్తి చేశారు. నూజివీడు నియోజకవర్గంలో వామపక్షాల నాయకులతో, వ్యవసాయ శాఖ అధికారులతో ఆర్డీఓ మంగళవారం సంయుక్త సమావేశం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ నూజివీడు ప్రాంతం విత్తన మొక్కజొన్న సాగుకు అనువైన ప్రాంతమని, అందుకే విత్తన కంపెనీలన్నీ ఇక్కడి రైతులతో విత్తన మొక్కజొన్న సాగు చేయించేందుకు పోటీపడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతులతో విత్తన కంపెనీలు ఒప్పందాలు కుదుర్చుకునేలా చూడాలని కోరారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం జరిగితే కంపెనీలు నష్ట పరిహారాన్ని అందజేయాలని, దిగుబడి కంపెనీలకు చేరిన తరువాత రైతులకు వారం రోజుల్లో నగదును చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. ఆర్డీఓ మోవిడి వాణి మాట్లాడుతూ రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా పని చేస్తున్నామని, రైతులకు నష్టం వాటిల్లేలా కంపెనీలు వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏడీఏ జి.విద్యాసాగర్, ఏఓ చాముండేశ్వరి, వామపక్షాల నాయకులు నిమ్మగడ్డ నరసింహ, పి.జమలయ్య, జి.రాజు, చలసాని వెంకట రామారావు, ఎస్ఆర్ హనుమాన్లు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు సన్మానం

గుంటుపల్లి(ఇబ్రహీంపట్నం): ప్రపంచ టాయిలెట్స్ దినోత్సవం సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులకు సన్మాన కార్యక్రమం గుంటుపల్లి పంచాయతీ ఆవరణలో మంగళవారం నిర్వహించారు. సర్పంచ్ భూక్య కవిత అధ్యక్షతన ఎంపీడీఓ సునీతశర్మ పారిశుద్ధ్య కార్మికులను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికుల నిరంతర శ్రమతో ప్రజలు ఆరోగ్యంగా ఉంటున్నారన్నారు. మన ఇళ్లల్లో వ్యర్థాలు ప్రతి రోజూ సేకరించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్న వారి కృషిని ప్రజలు గుర్తించాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సరిత, మండల పంచాయతీ విస్తరణాధికారి మనోజ్, పంచాయతీ కార్యదర్శి మునేశ్వరరావు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

- **మైలవరం:** గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని ఎంపీడీఓ అనూరాధ అన్నారు. మైలవరం మండల పరిషత్ కార్యాలయంలో ప్రపంచ టాయిలెట్స్ డేను పురస్కరించుకుని మండలంలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న పారిశుద్ధ్య సిబ్బందిని మంగళవారం సన్మానించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. మైలవరం ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో మానవహారం ఏర్పాటు చేశారు. పలువురు సర్పంచ్‌లు, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, సిబ్బంది పాల్గొన్నారు.


మైలవరంలో పారిశుద్ధ్య సిబ్బందిని సత్కరిస్తున్న ఎంపీడీఓ, సర్పంచ్‌లు


ఇబ్రహీంపట్నంలో పారిశుద్ధ్య కార్మికులను సన్మానిస్తున్న ఎంపీడీఓ సునీతశర్మ, సర్పంచి కవిత

మత్తు వదిలితేనే భవిష్యత్

నూజివీడు: మండలంలోని యనమదల హైస్కూల్‌లో మంగళవారం నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు 'మత్తు వదిలితేనే భవిష్యత్' అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ డి.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులు మంచి బాటలో నడవాలని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తు పదార్థాలు సేవించడం వలన భవిష్యత్ అంధకారమవుతుందన్నారు. అనంతరం వక్తృత్వ పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హెచ్‌ఎం జాన్సన్, ఉపాధ్యాయులు పిల్లా జోజప్ప, భాగ్య తదితరులు పాల్గొన్నారు.

- **ఆగిరిపల్లి:** విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని నీ తోడు మానసిక వికాస్ కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ దేవమణి అన్నారు. మంగళవారం నెక్కలం గొల్లగూడెంలోని చుక్కపల్లి పబ్లిక్ పాఠశాలలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాలు నిర్వహించారు.



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ప్రధానోపాధ్యాయుడు

పాఠశాలల వేళలు మార్చవద్దని వినతి

మైలవరం: పాఠశాలల వేళలను మార్చవద్దని పీఆర్‌టీయూ మైలవరం మండల శాఖ అధ్యక్షుడు పి. గోపాల్, ప్రధాన కార్యదర్శి ఎం. వెంకటేష్ ప్రభుత్వాన్ని కోరారు. మైలవరం పీఆర్‌టీయూ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఉన్నత పాఠశాలలను పాత సమయాలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే నిర్వహించాలన్నారు. విద్యార్థులు పాఠశాలలకు రావడానికి, తిరిగి ఇళ్లకు వెళ్లేందుకు ఈ సమయం అనుకూలంగా ఉంటుందన్నారు. సమయం మార్చడం వలన ట్రాఫిక్ రద్దీగా ఉండి ఇళ్లకు చేరడానికి పొద్దు పోతుందని, దీనివలన సాయంత్రం వేళ పిల్లలు ఇంటి వద్ద చదువుకునేందుకు ఇబ్బందులు పడతారన్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా పాఠశాలల పని వేళలు ఉదయం 9 నుంచి 4 గంటల వరకు మాత్రమే అని చెప్పారు. విద్యా శాఖలో పదో తరగతి పిల్లలు ఉత్తీర్ణత శాతం పెంచే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్థానిక పరిస్థితులను అర్థం చేసుకుని యాప్‌ల భారం తగ్గించాలని కోరారు. సమావేశంలో నాయకులు ఎ. పుల్లారెడ్డి, సతీష్, సూరిబాబు, కల్పన, గోపాల్, శేషగిరిరావు, హర్షనందిని తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణానికి స్థలం పరిశీలన

ముసునూరు: రమణక్కపేట కుమ్మరి బజారులో సీసీ రహదారి నిర్మాణానికి రబ్బీష్ తరలించారు. ఆ వీధిలో మురుగునీరు ప్రవహించేందుకు అవకాశం లేదని, పక్కా డ్రెయినేజీ ఏర్పాటు చేసిన తర్వాతే రహదారి నిర్మించాలని స్థానికులు పట్టుబట్టారు. సమాచారం అందుకున్న నూజివీడు ఆర్డీఓ ఎం. వాణి మంగళవారం సాయంత్రం రమణక్కపేటలో రహదారి నిర్మించనున్న ప్రదేశాన్ని పరిశీలించి స్థానికులతో మాట్లాడారు. ప్రస్తుతం రహదారి ఉన్న ప్రదేశంలో మురుగునీరు, వర్షం నీరు బయటకు పోయే అవకాశం లేనందున రోడ్డుకు ఇరువైపులా పక్కా డ్రెయినేజీ నిర్మించవలసిన ఆవశ్యకతను ఆర్డీఓకు వివరించారు. దీంతో ఆమె స్థల సేకరణ చేసి త్వరలో డ్రెయినేజీ నిర్మిస్తామని స్థానికులకు హామీ ఇచ్చారు. తహసీల్దార్ రాజ్‌కుమార్, పంచాయతీరాజ్ అధికారులు పాల్గొన్నారు.

ఝాన్సీ లక్ష్మీబాయికి ఘన నివాళి

నూజివీడు: వీరనారి ఝాన్సీ లక్ష్మీబాయి జయంతి కార్యక్రమం మండలంలోని లీలానగర్ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం నిర్వహించారు. ఝాన్సీ లక్ష్మీబాయి చిత్రపటానికి పాఠశాల హెచ్‌ఎం ఎంవీ విరూపాక్షరావు పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ 1857లో ఆంగ్లేయుల పాలనకు వ్యతిరేకంగా జరిగిన మొదటి స్వాతంత్ర్య సంగ్రామంలో ప్రముఖ పాత్ర పోషించిందన్నారు. త్యాగధనుల జీవిత చరిత్రలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు.

14న జాతీయ లోక్ అదాలత్

నూజివీడు: జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డిసెంబరు 14న నిర్వహిస్తామని న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, 15వ అదనపు జిల్లా జడ్జి ఎ. నాగశైలజ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేసుల పరిష్కారానికి సుముఖంగా ఉన్న కక్షిదారులు తమ న్యాయవాది ద్వారా ఇరు పార్టీలు హాజరైతే రాజీ మార్గంలో కేసులు పరిష్కరిస్తామన్నారు. లోక్ అదాలత్‌లో రాజీకి వీలున్న అన్ని క్రిమినల్, బ్యాంక్ రికవరీ, ఎక్సైజ్, చెక్ బౌన్స్, మోటర్ యాక్సిడెంట్ కేసులు పరిష్కరిస్తామని చెప్పారు.

